సాక్షి
అనంతపురం

గురువారం । 23 । మే । 2024



టన్ను చీనీ రూ.39 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.39 వేలు పలికాయి.



అంజూర సాగు.. లాభాలు బాగు

పెద్దపప్పూరు మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన రైతు సోదరులు అంజూర సాగుతో లాభాలు గడిస్తున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
39.2°/24.1°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి.. ఉక్కపోత, వడగాల్పులు తీవ్రత కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఈనెల 24 నుంచి మే 1 వరకు జరగనున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వి. వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 34 కేంద్రాల్లో జరగనున్న పరీక్షలకు మొదటి, రెండో సంవత్సరం కలిపి మొత్తం 22,510 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ రెండో సంవత్సర పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన బందోబస్తు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్ష సమయంలో ఎలాంటి అంతరాయం కలుగండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. అన్ని చోట్ల ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, డీవీఈఓ వెంకటరమణనాయక్, డీఈఓ వరలక్ష్మి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ సుజాత, కార్మిక శాఖ డీసీ లక్ష్మీనరసయ్య, ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ మేనేజర్ రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడూ ఇంటర్ ఫీజు చెల్లించొచ్చు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు తత్కాల్ కింద గురువారం కూడా చెల్లించవచ్చు.ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే సమయం ఇస్తూ ఇంటర్ బోర్డు కమిషనర్ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరమణనాయక్ కోరారు. తత్కాల్ కింద రూ. 3 వేలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అన్ని యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రత్యేక చొరవ తీసుకుని ఎవరైనా ఫీజు చెల్లించని వారు ఉంటే తల్లిదండ్రులతో మాట్లాడి ఫీజు చెల్లించేలా చూడాలని ఆదేశించారు.

ఆన్‌లైన్ మూల్యాంకనంపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనంపై బుధవారం రాష్ట్రస్థాయి అధికారులు వర్చువల్ విధానంలో అవగాహన కల్పించారు. అనంతపురంలోని కొత్తూరు ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సుకు జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల నుంచి 150 మంది అధ్యాపకులు హాజరయ్యారు. ఇంటర్ బోర్డు అధికారులు వి.సుబ్బారావు, వి.రమేష్ ఆన్‌లైన్ మూల్యాంకనం చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. సదస్సులో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్, డీఈసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు

అనంతపురం అర్బన్: ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ బుధవారం జేఎన్‌టీయూలోని స్ట్రాంగ్ రూములను తనిఖీ చేశారు. అధికారులకు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వర్షం వస్తే స్ట్రాంగ్ రూముల్లోకి నీరు వెళ్లకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. ప్రతి స్ట్రాంగ్ రూమును తనిఖీ చేసి లీకేజీకి అవకాశం ఉందా అనేది గమనించాలని, లీకేజీకి ఆస్కారం ఉంటే తక్షణం మరమ్మతు చేయాలని చెప్పారు. గదులకు వెనుక, ముందు టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. పై అంతస్తు నుంచి నీరు గదిలోకి దిగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఓ రాంభూపాల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళరెడ్డి, అధికారులు ఉన్నారు.

ఇక.. టమాట

టమాట సీజన్ ప్రారంభం

- పెరుగుతున్న ధరలతో సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు
- ఎక్కడ చూసినా టమాట సాగే..



నర్సరీల్లో అమ్మకానికి ఉంచిన టమాట నార



ఆత్మకూరు: కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు టమాట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో 15 కిలోల బాక్సు ధర ఏకంగా రూ.500 వరకు పలుకుతోంది. గత ఏడాది వర్షాలు సరిగా కురవక, పంటలు అనుకున్న విధంగా చేతికి రాక నష్టం వాటిల్లింది. ప్రస్తుతం సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో చాలా మంది రైతులు టమాట సాగు చేస్తున్నారు. చిన్న, సన్న కారు రైతులు ఎక్కువగా ఈ పంటపై ఆధారపడుతున్నారు. గత ఏడాది ఈ సీజన్‌లో 215 హెక్టార్లలో టమాట సాగైంది. ఈ ఏడాది విస్తీర్ణం బాగా పెరగవచ్చని వ్యవసాయ సిబ్బంది తెలిపారు.

నర్సరీల్లో డిమాండ్

మార్కెట్‌లో టమాట నారకు డిమాండ్ పెరిగింది. ఎకరాకు 15 వేల నుంచి 20 వేల మొక్కల వరకూ సాగు చేస్తారు. ప్రస్తుతం ఒక మొక్క 50 పైసల వరకూ పలుకుతోంది. జిల్లాలో 150 నర్సరీలకు పైగానే ఉన్నాయి. ఒక ఎకరాలో టమాట పంట పెట్టేందుకు రూ.20 వేల వరకూ పెట్టుబడి వస్తుందని రైతులు తెలియజేస్తున్నారు.

అనుకూలిస్తే ఆకాశానికి.. పడితే పాతాళానికే

టమాట లాభాలు లాటరీల్లా ఉన్నట్లు ఉంటాయి. ధర లేకపోతే రైతులు తమ పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలియక, రోడ్డు పక్కన పడేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. గత ఏడాది 15 కిలోల బాక్సు ధర దాదాపు రూ.2 వేల వరకు పలికింది. అయితే, ఆ సమయంలో ఎక్కువగా పంట చేతికి రాకపోవడం గమనార్హం. అయితే, ఏది ఎలా ఉన్నా, టమాట ధరల్లో అనిశ్చితి కొనసాగుతున్నా, రైతులు మాత్రం ఎంతో ఆశతో పంట సాగు చేస్తూనే ఉన్నారు.

అనుక్షణం.. అప్రమత్తం

- జిల్లాలో 24 గంటలూ పటిష్ట పోలీసు నిఘా
- జూన్ 4న ఎన్నికల ఫలితాల నేపథ్యంలో భద్రత పెంపు
- సమస్యాత్మక ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా
- గ్రామాల్లో గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు



గ్రామ సభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

అనంతపురం: ఓట్ల లెక్కింపు ఘడియలు దగ్గరయ్యే కొద్దీ ఉద్విగ్న వాతావరణం నెలకొంటోంది. ఈ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా జిల్లావ్యాప్తంగా పటిష్టమైన పోలీసు నిఘా ఏర్పాటు చేశారు. ఇప్పటికే 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంది. ఎన్నికల ఫలితాల ముందుగానీ, తరువాత గానీ గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, స్టేజ్ ప్రోగ్రాంలకు ఎటువంటి అనుమతుల్లేవని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలను రెచ్చగొట్టేలా రాజకీయ నాయకుల సందేశాలు, నిరాధార ఆరోపణలు, రచ్చబండ చర్చలు, సోషల్ మీడియాలో ప్రచారం మొదలైన వాటిని నేరంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. పెట్రోలు బంకుల్లో లూజ్ పెట్రోల్ అమ్మకాలతో పాటు బాణసంచా విక్రయాలపై ఆంక్షలు విధించారు. జూదం, కోడి పందేలు, బెట్టింగ్ మొదలైన చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నాటుసారా, మద్యం, వస్తువులు అక్రమ రవాణా జరగకుండా ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. అపరిచిత వ్యక్తులు, అనుమానిత వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ఇప్పటికే 6,289 మంది బైండోవర్

సీఐ, ఎస్‌ఐ స్థాయి పోలీసు అధికారులు గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ వర్గాల ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. కౌంటింగ్ సమయంలో కోడ్ ఉల్లంఘనలకు పాల్పడితే తీసుకునే కఠిన చర్యలను వివరిస్తున్నారు. గ్రామాల్లో పోలీసు పికెట్, పెట్రోలింగ్, ఔట్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించేవారు, ప్రజలను ఇబ్బంది పెట్టేవారిని గుర్తించి ముందస్తుగా బైండోవర్ చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి దాకా 6,289 మందిని బైండోవర్ చేశారు. 136 మంది రౌడీషీటర్లు, కిరాయి హంతకులు, ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు.మట్కా, అక్రమ మద్యం, గుండాగిరీ చేస్తున్న 8 మందిని జిల్లా నుంచి బహిష్కరించారు.

స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రత

ఒక వైపు శాంతి భద్రతల పర్యవేక్షణకు చర్యలు తీసుకుంటూనే, మరో వైపు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే కేంద్ర బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వ్, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. 24 గంటలూ నిరంతర సీసీ కెమెరాల నిఘా, ప్రత్యేక సాయుధ బలగాల పహారా ఏర్పాట్లు ఉన్నాయి.

అర్ధరాత్రి ఎస్పీ ఆకస్మిక తనిఖీ..



మంగళవారం అర్ధరాత్రి సమయంలో జేఎన్‌టీయూ స్ట్రాంగ్ రూంల వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమి శాలి

అనంతపురంలోని జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంల భద్రతను మంగళవారం అర్ధరాత్రి ఎస్పీ గౌతమి శాలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే పోలీసింగ్ ఎలా ఉందో తెలుసుకోవడానికి జిల్లా పోలీసు కార్యాలయంలోని డయల్ -100 విభాగాన్ని పరిశీలించారు. అర్ధరాత్రి వేళ ప్రజలు, బాధితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు ఎలా స్పందిస్తున్నారో ఆరా తీశారు. చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు.

విత్తన నాణ్యతలో లోపాలుంటే చర్యలు



విత్తనాల మొలక శాతాన్ని పరిశీలిస్తున్న డీఏఓ

బెళుగుప్ప: విత్తన నాణ్యతలో లోపాలుంటే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారిణి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ అన్నారు. మండల కేంద్రంలోని వినాయక సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. వేరుశనగ విత్తన ప్రాసెసింగ్‌కు రైతుల నుంచి సేకరించిన విత్తనాల వివరాలు, ఆర్‌బీకేల ద్వారా పంపించిన వివరాలను పరిశీలించారు. నాణ్యత లేని విత్తనకాయలను పంపినట్లయితే శాఖాపరమైన చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ ఎల్లప్ప, వ్యవసాయ అధికారులు పృథ్వీసాగర్, వాసుకి రాణి, రాకేష్‌నాయక్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు

కళ్యాణదుర్గం రూరల్: ఇంటర్ ఒకేషనల్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళ్యాణదుర్గం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్ తెలిపారు. Sbtet.ap.gov.in/apSBTET వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 28లోగా పరీక్ష ఫీజు రూ.400 చెల్లిచాలని, జూన్ 2న తిరుపతిలోని ఎస్వీ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష ఉంటుందని తెలిపారు.

ప్రశాంతంగా జాతర జరుపుకోవాలి



వేల్పుమడుగువాసులతో మాట్లాడుతున్న కలెక్టర్

విడపనకల్లు: అల్లర్లకు పాల్పడకుండా, ప్రశాంత వాతావరణంలో జాతర జరుపుకోవాలని కలెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. మండల పరిధిలోని వేల్పుమడుగు గ్రామంలో గురువారం సుంకలమ్మ ముత్యాల పల్లకీ ఊరేగింపు చేసుకుంటామని గ్రామస్తులు ఎస్‌ఐ ఖజాహుస్సేన్, తహసీల్దార్ దస్తగిరయ్యకు రెండు రోజుల క్రితం వినతి పత్రం సమర్పించారు. అయితే ఎన్నికల నేపథ్యంలో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో కలెక్టర్ బుధవారం వేల్పుమడుగు గ్రామంలో పర్యటించారు. స్థానిక సర్పంచు తిప్పారెడ్డి, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. జిల్లాలో పలు చోట్ల పోలింగ్ అనంతరం నెలకొన్న పరిణామాలను వివరించారు. గొడవలకు తావివ్వమంటేనే అనుమతి ఇస్తామన్నారు. అందరం కలసికట్టుగా,సామరస్యంగా జాతర జరుపుకుంటామని గ్రామస్తులు తెలపడంతో అనుమతినిచ్చారు. అనంతరం సుంకలమ్మ ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి, గ్రామ పెద్దలు లక్ష్మిరెడ్డి, తిమ్మారెడ్డి, నారాయణరెడ్డి, పెద్దన్న, శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ పరమేషప్ప, పాల్గొన్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి

రికార్డులు పక్కాగా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం విడపనకల్లు తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో తహసీల్దారు దస్తగిరయ్యపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయంలో రికార్డుల గదిని పరిశీలించారు. రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండేలా చూసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయం నుంచి ఎలాంటి సేవలు అందిస్తున్నామో ప్రజలకు తెలిసేలా సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయాలన్నారు. సీసీఆర్‌సీ కార్డుల మంజూరు కోసం అర్హులైన రైతులను గుర్తించాలని సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

నేరచరిత లేనివారిని బైండోవర్ చేయొద్దు

- జిల్లా ఎస్పీకి వైఎస్సార్ సీపీ నేతల వినతి



ఎస్పీ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థులు విశ్వేశ్వర రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వీరాంజనేయులు, పార్టీ లీగల్ సెల్ నేతలు

అనంతపురం: నేరచరిత లేని వారిని బైండోవర్ చేయరాదని వైఎస్సార్ సీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ గౌతమి శాలిని కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం అనంతపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ విలేకరులతో మాట్లాడుతూ తాడిపత్రిలో జరిగిన సంఘటనలను ఆధారంగా చేసుకుని ప్రజలను ఇబ్బందులకు గురి చేయరాదన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నేరచరిత లేని వారిని సైతం బైండోవర్లు చేస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. మళ్లీ తమ పార్టీనే అధికారంలోకి రాబోతోందని, సీఎంగా వైఎస్ జగన్ రెండో దఫా ప్రమాణం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలకు పాల్పడ్డ వారిని మాత్రమే బైండోవర్ చేయాలని కోరారు. నేరచరిత లేని వారు, ఎన్నికల సమయంలో ఆటంకాలు సృష్టించని వారిని బైండోవర్లు చేయకూడదని ఎస్పీని కోరినట్లు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా ప్రశాంతతకు మారు పేరని, గతంలో ఒక హోంగార్డు, ఒక పోలీసుతోనే నాలుగు పోలింగ్ బూత్‌ల నిర్వహణ చేపట్టారంటేనే ఈ విషయం అర్థం చేసుకోవచ్చన్నారు. ఉరవకొండ అభ్యర్థి వై. విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఒక్కో పల్లెలో 10 మందిని బైండోవర్ చేస్తుండడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. తిరునాళ్లు, జాతరలు జరిగే కాలం ఇదని, ఈ నేపథ్యంలో ఆంక్షలను సడలించాలని విజ్ఞప్తి చేశారు. కౌంటింగ్ ప్రక్రియకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. కౌంటింగ్‌కు ఏజెంట్లుగా ఉన్న వారిని ఇబ్బందులకు గురి చేయరాదన్నారు. కౌంటింగ్ కూడా ప్రశాంతంగా ముగియాలని ఆకాంక్షించారు. శింగనమల వైఎస్సార్ సీపీ అభ్యర్థి వీరాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో సాధారణ పౌరుల స్వేచ్ఛకు భంగం కలిగేలా వ్యవహరించరాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి, జనరల్ సెక్రటరీ ఈ. వెంకట రాముడు, ఉపాధ్యక్షుడు జూటూరు సుధాకర్ రెడ్డి, కమిటీ సభ్యులు టి. గోకుల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. నృసింహుని జయంత్యుత్సవం



విశేష అలంకరణలో లక్ష్మీ నృసింహస్వామి



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామి జయంతి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. స్వామి మూలవిరాట్‌కు వేకువజామునే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీస్వామి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ మూర్తుల ఊరేగింపు కనులపండువగా జరిగింది. సింహ, చంద్రప్రభ వాహనాలపై స్వామి ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

పరీక్ష రోజు ఫీజు చెల్లించినా హాల్‌టికెట్

- రేపటి నుంచి టెన్త్ 'సప్లీ'



అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 3 వరకు పరీక్షలు సాగుతాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి విద్యార్థులకు ప్రభుత్వం సువర్ణావకాశం కల్పించింది. ఇప్పుడెవరైనా ఫీజు చెల్లించకపోయినా పరీక్ష జరిగే రోజైనా చెల్లించి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరుకావచ్చు. ఈ అవకాశాన్ని ఫెయిల్ అయిన విద్యార్థులందూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. జిల్లాలో మొత్తం 13,332 మంది విద్యార్థులు హాజరవుతున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 45 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

వచ్చే ఏడాది నుంచి సిలబస్‌లో మార్పు..

వచ్చే విద్యా సంవత్సరం (2024-25) నుంచి పదో తరగతి సిలబస్ మారుతుందని డీఈఓ తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రతి విద్యార్థీ పరీక్షకు హాజరయ్యేలా చూడాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా ప్రత్యేకంగా మాట్లాడాలని సూచించారు. ఫెయిల్ అయిన విద్యార్థులు ఫీజు చెల్లించలేకపోయినా హెచ్ఎంలను కలిస్తే హాల్‌టికెట్లు ఇస్తారని, వాటిని తీసుకుని పరీక్షలకు హాజరుకావాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవింద నాయక్ తెలిపారు.

క్లుప్తంగా

బీటీపీకి చేరిన వరద


బీటీపీలోకి చేరుతున్న నీరు

కళ్యాణదుర్గం/గుమ్మఘట్ట: కర్ణాటక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తుతోంది. మంగళవారం కురిసిన భారీ వర్షానికి వేదవతి హగరి నది పరవళ్లు తొక్కుతోంది. దీంతో ప్రాజెక్ట్ దిగువ ఉన్న కుడి, ఎడమ కాలువ చుట్టుపక్కల ఉన్న గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 40.1 అడుగులకు నీటిమట్టం చేరుకోవడంతో చేరడంతో రైతులు, మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కిమ్స్-సవీరలో ఆరోగ్య శ్రీ సేవలు

అనంతపురం మెడికల్: నగరంలోని కిమ్స్-సవీర ఆస్పత్రిలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఎంప్లాయీస్ హెల్త్ స్కీం, ప్రభుత్వ ఉద్యోగులకు రీయింబర్స్‌మెంట్‌తో కూడిన వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ మేరకు ఆ ఆస్పత్రి యాజమాన్యం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి జయంతి

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ముఖమండపంలో అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహ స్వామివారిని స్తంభంలో ఆవాహనం చేసి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముగిసిన ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు


విజేతలతో నిర్వాహకులు

అనంతపురం: ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ సౌజన్యంతో ఏ-1 చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించిన సీనియర్ ఓపెన్, మహిళా చెస్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ముగిసాయి. 5కు 5 పాయింట్లు సాధించి చాంపియన్ షిప్‌ను కె.రామసాయి దక్కించుకున్నారు. రన్నరప్‌గా అమ్మినేని ఉదయకుమార్ నాయుడు నిలిచారు. మూడో స్థానంలో కృష్ణ సుధీంద్ర వెంకటసముద్రాల, నాల్గో స్థానంలో కుశాల్ నిలిచారు. అలాగే జిల్లా మహిళా చెస్ చాంపియన్‌షిప్-2024 టైటిల్‌ను శ్రీహజి దక్కించుకున్నారు. రన్నరప్‌గా అస్మిత అనిమి, మూడో స్థానంలో యశస్విని అనిమి, నాలుగో స్థానంలో కటారి భువనకృతి నిలిచారు. సీనియర్ ఓపెన్ విభాగంలో ఎంపికైన విజేతలు 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. మహిళా విభాగంలో ఎంపికైన విజేతలు 25, 26 తేదీల్లో హిందూపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు.

అంజూర సాగు.. లాభాలు బాగు

- డ్రైఫ్రూట్స్‌గా మార్చి మూడు రాష్ట్రాలకు ఎగుమతి
- 16 ఎకరాల్లో అంజూర పంట సాగు
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం
- ఆదర్శంగా నిలిచిన రైతు సోదరులు జగదీష్ నాయుడు, రమేష్‌నాయుడు


చెట్టుకు కాసిన అంజూర కాయలు


అంజూర పండ్లను ఎండబెట్టిన దృశ్యం

పెద్దపప్పూరు: మనసు పెట్టి వ్యవసాయం చేస్తే సాధించలేనిది ఏది లేదు అంటూ నిరూపిస్తున్నారు జిల్లాకు చెందిన రైతులు. అందుబాటులో ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుని అధిక లాభాలను గడిస్తున్నారు. ఈ క్రమంలోనే పెద్దపప్పూరు మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన రైతు సోదరులు జగదీష్ నాయుడు, రమేష్‌నాయుడు అంజూర సాగుతో అందరికీ ఆదర్శంగా నిలిచారు.

ఎంబీఏ పూర్తి చేసి.. ఉద్యోగానికి వదులుకుని

ధర్మాపురం గ్రామానికి చెందిన జగదీష్‌నాయుడు ఎంబీఏ పూర్తి చేసి బెంగళూరు, అనంతపురం నగరాల్లోని ప్రముఖ ఫైనాన్స్ కంపెనీల్లో ఉన్నత శ్రేణి ఉద్యోగం చేశారు.. ఈ క్రమంలోనే రాయన్నపల్లికి చెందిన ఓ రైతు సాగు చేస్తున్న దానిమ్మ తోటను తరచూ సందర్శించేవారు. ఆ రైతు స్ఫూర్తితో తాను కూడా వ్యవసాయం చేయాలని భావించిన ఆయన వెంటనే ఆ దిశగా అడుగులు వేశాడు. తాను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి అనంతపురం రూరల్ పరిధిలోని కామారుపల్లిలో 7 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. తొలుత దానిమ్మ పంట సాగు చేద్దామనుకున్న జగదీష్ నాయుడు... ఊహించని విధంగా అంజూర సాగుపై దృష్టి సారించారు. రాయన్నపల్లికి చెందిన రైతు ద్వారా అమెరికా నుంచి డయానా రకం 10 వేల అంటు మొక్కలను తెప్పించుకుని 2015, నవంబర్‌లో పొలంలో నాటారు. అమెరికా ఉంచి అంట్లు తెప్పించుకున్నందుకు ఒక్కో మొక్కకు రూ.60 వరకు ఖర్చు వచ్చింది.

ప్రయోగం విజయవంతం

కామారుపల్లిలో ప్రయోగాత్మకంగా చేపట్టిన అంజూర సాగు విజయవంతమై లాభాలు రావడంతో సోదరుడు రమేష్‌నాయుడు ద్వారా స్వగ్రామం ధర్మాపురంలోని తమ సొంత పొలం నాలుగు ఎకరాల్లో అంజూర మొక్కలు నాటించారు. మొక్కలు నాటిన ఎనిమిది నెలలకు పంట చేతికి వచ్చింది. పంట సాగు కోసం తొలుత ఎకరానికి రూ.50వేలు చొప్పున పెట్టుబడి పెట్టగా తొలి కాపులోనే పెట్టిన పెట్టుబడి మొత్తం చేతికి అందింది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో అంజూర రూ.90 నుంచి రూ.110 ధర పలుకుతోంది. మొక్క నాటిన రెండేళ్ల తర్వాత ఎకరానికి దాదాపు రెండు టన్నుల వరకు పంట దిగుబడి వస్తుంది.

వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి

తొలి దశలో ప్రయోగాత్మకంగా చేపట్టిన అంజూర సాగులో ఊహించని లాభాలు రావడంతో రైతు జగదీష్ నాయుడు మరో అడుగు ముందుకు వేశారు. కేవలం పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకోవడమే కాకుండా వాణిజ్య స్థాయిలో ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయాలనే ఆలోచనతో డ్రై అంజూర ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. దీంతో రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టి ప్రత్యేకంగా షెడ్‌నెట్‌తో గది ఏర్పాటు చేశారు. నిర్దిష్టమైన ఉష్ణోగ్రతలు ఉండేలా చర్యలు తీసుకుని తాను పండించిన నాణ్యమైన అంజూర పండ్లను డ్రై ఫ్రూట్స్‌గా మార్చి రెండింతల ఆదాయాన్ని గడించసాగారు. కేవలం సేంద్రీయ ఎరువులనే వినియోగిస్తుండడంతో నాణ్యమైన పంట ఉత్పత్తులు చేతికి అందుతున్నాయి. వీటికి డిమాండ్ భారీగా నెలకొంది. దీంతో ఆంధ్రలోని వివిధ జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాలకు ఎగుమతులు చేపట్టారు. ఫోన్ చేసి ఆర్డర్ ఇవ్వగానే కిలో అంజూర డ్రై ఫ్రూట్స్‌ను రూ.800 నుంచి రూ.వెయ్యి చొప్పున కొరియర్ ద్వారా అందజేస్తున్నారు. అంజూరా పంటను సాగు చేస్తే లాభాలే తప్ప నష్టం అనే మాటనే ఉండదంటూ రైతులను చైతన్య పరుస్తూ వారికి అందుబాబులో ఉండేలా స్వయంగా తానే అంటు కట్టిన మొక్కలను విక్రయించసాగారు. ఒక్కో మొక్కను రూ.10 నుంచి రూ.18 చొప్పున అమ్ముడుపోతోంది.

డ్రైఫ్రూట్స్‌గా మారిస్తే లాభం ఎక్కువ



అంజూర పంటను మార్కెట్‌లో అలాగే విక్రయిస్తే కిలో రూ.90 నుంచి రూ.120తో అమ్ముడుపోతోంది. అదే పంటను డ్రైఫ్రూట్‌గా మార్చి విక్రయిస్తే కిలో రూ.800 నుంచి రూ.1000 వరకూ ధర పలుకుతోంది. సేంద్రియ ఎరువులతో పంట పండిస్తున్నాం. దీంతో పంట దిగుబడులు ఎంతో నాణ్యతతో ఉంటున్నాయి. వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంది. ఆంధ్రలోని పలు జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. ఏటా 10 నెలల పాటు దిగుబడి వస్తూనే ఉంటుంది.

– రైతు రమేష్‌నాయుడు, ధర్మాపురం, పెద్దపప్పూరు మండలం


ఎగుమతుల కోసం సిద్ధం చేసిన డ్రైఫ్రూట్స్

ఎలాంటి తెగుళ్లు వ్యాపించవు



అంజూర పంట సాగులో తెగుళ్ల బాధ ఉండదు. పంట సాగులో అధిక ప్రాధాన్యత సేంద్రియ ఎరువులకే ఇవ్వాలి. అప్పుడే పంట దిగుబడి ఎక్కువగా ఉంటుంది. నాణ్యత కూడా అలాగే ఉంటుంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులకు అంజూరా పంట సాగు ఎంతో ఆసరాగా ఉంటుంది. మార్కెట్లో ఒక కిలో డ్రై అంజూరా రూ.800 వరకు ధర పలుకుతుంది. అంజూర సాగుపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడమే కాక, సొంతంగా మేమే అంటు కట్టిన మొక్కలను విక్రయిస్తున్నాం.

– జగదీష్‌నాయుడు, ధర్మాపురం

బాధ్యతగా విధులు నిర్వర్తించండి

- ప్రభుత్వానికి, పశుశాఖకు మంచిపేరు తీసుకురండి
- వీఏహెచ్‌ఏల శిక్షణ ముగింపు కార్యక్రమంలో పశుశాఖ జేడీ సుబ్రహ్మణ్యం


శిక్షణ పూర్తి చేసుకున్న వీఏహెచ్‌ఏలతో పశుశాఖ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వానికి, పశుసంవర్ధకశాఖకు మంచి పేరు తీసుకురావాలని నూతన విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ల (వీఏహెచ్‌ఏ)కు పశుశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం సూచించారు. ఆర్‌బీకే వేదికగా రైతులకు నాణ్యమైన సేవలందించాలన్నారు. కొత్తగా నియమితులైన 280 మంది వీఏహెచ్‌ఏలకు ఏప్రిల్ 1 నుంచి నిర్వహిస్తున్న 45 రోజుల శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక పశుశాఖ జేడీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి జేడీ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించిన 280 మందిని బ్యాచ్‌లుగా విభజించి అనంతపురం జేడీ కార్యాలయ ప్రాంగణంలో రెండు బ్యాచ్‌లు, సాయినగర్ పశువుల ఆస్పత్రిలో ఒక బ్యాచ్, రెడ్డిపల్లి ప్రాంతీయ పశుశిక్షణా కార్యాలయంలో రెండు బ్యాచ్‌లు, సిద్ధరాంపురం పశుగ్రాస క్షేత్రంలో ఒక బ్యాచ్ చొప్పున ఆరు బ్యాచ్‌లకు 45 రోజుల పాటు శిక్షణ ఇవ్వడానికి 28 మంది అధికారులను నియమించామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను ఆర్‌బీకే వేదికగా రైతులకు అందజేయాలన్నారు. పశు, జీవ సంపద పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన పశుశాఖ జేడీ, డీడీలు, ఏడీలు, పలువురు డాక్టర్లను ఈ సందర్భంగా జ్ఞాపికలు అందజేసి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వీఏహెచ్‌ఏలు వారికి కేటాయించిన ప్రాంతాల్లో గురువారం పంచాయతీ కార్యదర్శులను కలసి రిపోర్టు చేసుకుని విధుల్లో చేరాలని ఆదేశించారు. కార్యక్రమంలో పశుశాఖ డీడీలు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ జి.వెంకటేష్, కోర్సు కోఆర్డినేటర్లు, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

కూడేరులో జూనియర్ కాలేజ్ ఏర్పాటు

- ఈ విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరానికి ప్రవేశాలు
- దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కూడేరు: పది తర్వాత ఉన్నత విద్య అభ్యసించాలనుకున్న కూడేరు మండల విద్యార్థుల ఇక్కట్లు దూరం చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటి వరకూ ఇంటర్, ఆపై చదువులకు కూడూరు మండలంలోని విద్యార్థులు ఉరవకొండ, అనంతపురానికి వెళ్లాల్సి వస్తోంది. ఈ పరిస్థితిలో మార్పు తెస్తూ ప్రభుత్వం కూడేరులోనే జూనియర్ కళాశాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసింది. ఈ విద్యాసంవత్సం నుంచే తరగతుల ప్రారంభానికి ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే జూనియర్ కళాశాల నిర్వహణకు ప్రత్యేకంగా ఓ బ్లాక్‌ను కేటాయించారు. జూనియర్ కళాశాల ఏర్పాటుపై జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఎంపీసీ, బైపీసీ గ్రూపులను తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో నిర్వహించేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారన్నారు. కో-ఎడ్యుకేషన్ విధానం కొనసాగుతుందన్నారు. జూనియర్ కళాశాల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో వెసులుబాటుగా ఉంటుందని, దరఖాస్తులు ఉన్నతపాఠశాలలోనే అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండలంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఆ ఇద్దరు టీచర్లపై విద్యాశాఖ ప్రేమ

అనంతపురం ఎడ్యుకేషన్: ఎన్నికల ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘిస్తూ ఓ రాజకీయ పార్టీకి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న టీచర్లకు చార్జ్ మెమోలు జారీ చేసి వారిచ్చే వివరణ బట్టి చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఈ విషయంగా విద్యాశాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలం కుర్లగుండ ప్రాథమిక పాఠశాల టీచరు రాఘవేంద్ర గుప్తా, నాగిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల టీచరు వై.మంజునాథ్ ఇద్దరూ కళ్యాణదుర్గం టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుతో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆ సమయంలో వీరికి బ్రహ్మసముద్రం మండల విద్యాశాఖ అధికారి హెచ్.ఓబుళపతి మండలంలోని ఇతర టీచర్ల పోస్టల్ బ్యాలెట్ ఆర్డర్లను అందజేశారు. ఈ ఆర్డర్ కాపీలు తమవద్ద అందుబాటులో ఉన్నట్లు సదరు టీచర్లు వాట్సాప్ గ్రూపుల్లోనూ మెసేజ్‌లు పెట్టారు. వీరి వ్యవహారంపై 'సి' విజిల్ యాప్ ద్వారా ఆధారాలతో సహ ఎన్నికల కమిషన్‌కు, రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై పత్రికల్లోనూ కథనాలు వెలువడ్డాయి. అయితే ఇప్పటి వరకూ వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కేవలం చార్జ్‌మెమోలు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. అలాగే బ్రహ్మసముద్రం ఎంఈఓపై చర్యలకు ఆర్జేడీకి సిఫార్సు చేశామని చెబుతున్నా... ఆర్జేడీ నుంచి ఇప్పటిదాకా ఎలాంటి ఉత్తర్వులు జారీ కాకపోవడం గమనార్హం.

ఈ ఇద్దరికంటే ఆ టీచరు పెద్ద తప్పు చేశాడా?

వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించాడంటూ ఎలాంటి విచారణ లేకుండానే సస్పెండ్ చేశారు. ఆయన చేసిన నేరం ఏంటంటే...'పదో తరగతి పరీక్షల నిర్వహణ, కోడింగ్ పనులు, స్పాట్ వాల్యూయేషన్ సిబ్బంది రెమ్యూనరేషన్‌ను ప్రభుత్వం గతేడాది పెంచిందని ఈ ఏడాది నుంచి అమలులోకి వచ్చిందంటూ హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం నిర్ణయానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ అంశంపై మార్చి 23న 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై ఆయనకు ఎలాంటి నోటీసులు, చార్జ్ మెమోలు ఇవ్వకుండా ఏకంగా సస్పెండ్ చేశారు. అయితే టీడీపీకి కార్యకర్తల్లా పనిచేసిన ఇద్దరు టీచర్లపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. విద్యాశాఖ అధికారుల 'పచ్చ'పాత ధోరణిపై ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా అశోక్ కుమార్‌రెడ్డి ఇచ్చిన పేపర్ ప్రకటనలో డీఈఓ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వ్యాఖ్యలు కూడా ఉన్నాయి. వారిని ఏమాత్రం పరిగణలోకి తీసుకోకపోవడం గమనార్హం.

ప్రాణం తీసిన వివాహేతర బంధం

- బేల్దారి ప్రసాద్ హత్య కేసులో వీడిన మిస్టరీ
- ముగ్గురు నిందితుల అరెస్ట్


నిందితులను చూపుతున్న పోలీసులు

గుంతకల్లు టౌన్: వివాహేతర బంధం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. తమ అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్త బేల్దారి బోయ దేవేంద్ర ప్రసాద్(39)ను భార్య ప్రియుడు హతమార్చిన ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను బుధవారం గుంతకల్లు వన్‌టౌన్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రామసుబ్బయ్య వెల్లడించారు. గుంతకల్లులోని అంకాలమ్మ గుడి వీధిలో నివాసముంటున్న దేవేంద్రప్రసాద్ బేల్దారిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొన్నేళ్ల క్రితం కవితతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. కాగా, కవితకు పెళ్లి కాక ముందే గుంతకల్లు మండలం నెలగొండకు చెందిన ఆమె సమీప బంధువు సుద్దికుంట సోమశేఖర్‌తో వివాహేతర సంబంధం ఉండేది. ప్రసాద్‌తో వివాహమైన తర్వాత కూడా ఆమెతో సోమశేఖర్ అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తూ తరుచూ ఇంటికెళ్లొచ్చేవాడు. ఏడాది క్రితం ఈ విషయాన్ని గుర్తించిన ప్రసాద్ ఇద్దరినీ మందలించాడు. అప్పటి నుంచి కవిత ఇంటికి సోమశేఖర్ వెళ్లేవాడు కాదు. అయితే ఎలాగైనా ప్రసాద్ అడ్డు తొలగించుకోవాలని భావించిన సోమశేఖర్ పథకం రచించాడు. ప్రసాద్‌తో కలసి బేల్దారి పనిచేసిన విడపనకల్లు మండలం కడదరబెంచి గ్రామానికి చెందిన జలపతి పెద్దరాయుడిని లోబర్చుకున్నాడు. ఈ నెల 14న రాత్రి మందు పార్టీ పెట్టుకుందామని ప్రసాద్‌కు పెద్దరాయుడితో ఫోన్ చేయించాడు. దీంతో పెద్దరాయుడిని ప్రసాద్ కలిశాడు. ఇద్దరూ కలసి గుంతకల్లు శివారులోని కల్వరి టెంపుల్ సమీపంలో ఉన్న నల్లరేగడి పొలంలో పీకల్లోతు మందు తాగారు. ఆ సమయంలో ప్యాపిలి రాముడుతో కలసి అక్కడకు చేరుకున్న సోమశేఖర్ నైలాన్ తాడుతో ప్రసాద్ గొంతు బిగించాడు. ఊపిరి ఆడక పెనుగులాడుతున్న ప్రసాద్‌ను ప్యాపిలి రాముడు గట్టిగా పట్టుకున్నాడు. కాసేపటి తర్వాత ప్రసాద్ ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి ముగ్గురూ జారుకున్నారు. 15వ తేదీ ఉదయం పొలాల్లో ప్రసాద్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. హతుడి తండ్రి లక్ష్మన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొలుత అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో హత్యగా నిర్ధారించారు. విచారణ అనంతరం సోమశేఖర్, పెద్దరాయుడు, ప్యాపిలి రాముడిని పక్కా ఆధారాలతో అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

నాటుసారా విక్రేతల అరెస్ట్

యాడికి: నాటుసారా రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం యాడికి మండలం కోనుప్పలపాడు గ్రామ శివారులో వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం సీతమ్మ తండా గ్రామానికి చెందిన రవినాయక్, నేరెడుచెర్ల గ్రామానికి చెందిన సేవ్యా నాయక్ 30 లీటర్ల నాటుసారాను తయారు చేసుకుని ద్విచక్ర వాహనంలో తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న మాక్‌డ్రిల్

- శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తాడిపత్రిలో పోలీసుల మాబ్ ఆపరేషన్
- రైలు ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు స్పందించే తీరుపై రైల్వే శాఖ ప్రదర్శన


మాక్ డ్రిల్‌లో భాగంగా రాళ్లు రువ్వుతున్న పోలీసులు


మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న సిబ్బందితో డీఆర్ఎం వినీత్‌సింగ్

తాడిపత్రి అర్బన్: కౌంటింగ్ రోజున శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు, ఆర్మ్‌డ్ రిజర్వ్, కేంద్ర పోలీసు బలగాలు తీసుకునే చర్యలపై తాడిపత్రిలోని జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్ ఆకట్టుకుంది. ఎస్పీ గౌతమిశాలి ఆదేశాలతో డీఎస్పీ జనార్దన్ నాయుడు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరిగినపుడు ఎలా స్పందిస్తారో ప్రత్యక్షంగా ప్రజలకు చూపించారు. హింసాత్మక సంఘటన జరిగితే, గుంపును నియంత్రించేందుకు చేసే హెచ్చరికలను ప్రయోగాత్మకంగా చూపించారు. హెచ్చరిక వినకపోతే వారు మేజిస్ట్రేట్ అనుమతితో బాష్పవాయువు ప్రయోగం, తమను తాము రక్షించుకోవడానికి లాఠీ చార్జ్, ఆపై వాటర్ కెనాన్ వినియోగం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో ప్రదర్శించారు. మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న పోలీసులు ప్రతి సన్ని వేషాన్ని ఆద్యంతం రక్తికట్టించడంతో చూసిన ప్రజలు అవాక్కయ్యారు. తొలుత అక్కడ నిజంగానే యుద్ధవాతావరణం నెలకొందని కొందరు పరుగులు తీశారు. తర్వాత అక్కడున్న వారందరూ మఫ్టీలో ఉన్న పోలీసులేనని తెలుసుకుని ఆసక్తిగా గమనించారు.

గూళ్యపాళ్యం రైల్వేస్టేషన్‌లో...

గుంతకల్లు: రైలు ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు రైల్వే సాంకేతిక నిపుణులు, పారా మెడికల్ సిబ్బంది స్పందించే తీరుపై బుధవారం గూళ్లపాళ్యం రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన మాక్ డ్రిల్ ప్రజలను అబ్బురపరిచింది. రైలు పట్టాలు తప్పిందంటూ డివిజన్ కేంద్రం గుంతకల్లులో అనౌన్స్‌మెంట్ జరిగిన వెంటనే ఆగమేఘాలపై అధికారులు, ఉద్యోగులు ఎలా స్పందిస్తారో ప్రత్యక్షంగా చూపించారు. ప్రత్యేక రైలుల్లో సేఫ్టీ, ఆపరేటింగ్, ఇంజనీరింగ్, కమర్షియల్, మెడికల్ విభాగాలకు చెందిన ఉన్నతాకారులతోపాటు సిబ్బంది ప్రమాదస్థలిని చేరుకుని విభాగాల వారిగా ఎవరికి వారు సహాయక చర్యలు చేపట్టే విధానాన్ని అందరూ రక్తికట్టించారు. మొత్తం ప్రక్రియను జోనల్ పీసీఎస్ఎం ప్రదీప్‌కుమార్, డిప్యూటీ సీఎస్ఓ అప్పారావు, డీఆర్ఎం వినీత్‌సింగ్, ఏడీఆర్ఎం సుధాకర్ తదితరులు పర్యవేక్షించారు. బోగీలను ఒకదానిపై ఒకటి ఎక్కించి ప్రమాద దృశ్యాన్ని కళ్లకు కట్టించారు. బోగిల్లో చిక్కుకున్న వారిని వెలికి తీయడం, గాయపడిన వారికి చికిత్సలు అందజేయడం, అంబులెన్స్‌లో తరలించడం, మంటలు చెలరేగితే ఆర్పే విధానం తదితర అంశాలను దాదాపు 3 గంటల పాటు ప్రదర్శించారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్, సీనియర్ డీఈఎన్ కోర్డినేషన్ అక్కిరెడ్డి తదితర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌కు గాయాలు


చికిత్స పొందుతున్న జయం ఫణి

కళ్యాణదుర్గం రూరల్: శ్రీసత్యసాయి జిల్లాలో చోటు చేసుకున్న ప్రమాదంలో స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి గాయపడ్డారు. వివరాలు... వ్యక్తిగత పనిపై మంగళవారం కదిరి ప్రాంతానికి వెళ్లిన జయం ఫణి... బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తిరుగు ప్రయాణమయ్యారు. వేకువజాము 3 గంటలకు ముదిగుబ్బ సమీపంలోకి చేరుకోగానే నియంత్రణ కోల్పోవడంతో ఆయన ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఘటనలో జయం ఫణికి తీవ్ర గాయాలయ్యాయి. కారు నడుపుతున్న డ్రైవర్‌తో పాటు కళ్యాణదుర్గానికి చెందిన ఎర్రిస్వామి, ప్రేమ్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అటుగా వెళుతున్న వారు ప్రమాదాన్ని గుర్తించి వెంటనే క్షతగాత్రుడిని అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎంపీ తలారి రంగయ్య ఫోన్‌లో బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, ఫణి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కాగా, బెంగళూరుకు జయం ఫణిని తరలిస్తున్న విషయం తెలుసుకున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పెనుకొండలో అంబులెన్స్‌ను ఆపి పరామర్శించారు.

శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు కొనసాగాలి

- జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి


స్థానికులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నిదియాదేవి

బొమ్మగుప్ప: గ్రామ కట్టుబాట్లను గౌరవిస్తూ శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని గ్రామస్తులకు జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి సూచించారు. బొమ్మగుప్పలో వెలసిన ఎర్రితాత స్వామి ఉత్సవాలు జూన్ 24న జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఆలయాన్ని జెడ్పీ సీఈఓ సందర్శించారు. తహసీల్దార్ హరినాథ్‌రావు, ఎంపీడీఓ సుబ్బరాజు, ఎస్ఐ శివతో కలసి గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికలు ముగిసిన తరువాత కూడా శాంతిభద్రతలకు ఎలాంటి అవాంతరాలు తలెత్తరాదన్నారు.

ఏఐఐబీ పనుల పూర్తికి గడువు పొడిగింపు

- పీఆర్ ఎస్ఈ ఈరాస్వామి


మాట్లాడుతున్న పీఆర్ ఎస్ఈ ఈరాస్వామి

అనంతపురం సిటీ: ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ఉద్దేశించిన ఏసీయన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) రుణ సాయంతో గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన రహదారులు, వంతెన (ఐఏఏబీ) నిర్మాణాల పూర్తికి మరో ఆరు నెలల గడువు పెంచినట్లు పంచాయతీరాజ్ ఎస్ఈ ఈరాస్వామి తెలిపారు. ఏఐఐబీ పనుల పురోగతిపై అనంతపురంలోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా అధికారులతో కలసి ఆయన సమీక్షించారు. ఈఈలు డీఎల్ శ్రీనివాసులు, కేవీకేవీ ప్రసాద్, డీఈఈలు రామచంద్రారెడ్డి, మల్లికార్జున, రామ్మోహన్, హనుమంతయ్యశెట్టి, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, ఏఈఈలు పాండురంగారెడ్డి, ఇతర ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.468 కోట్లతో 332 పనులు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో అనంతపురం జిల్లాలో ఏఐఐబీ కింద రూ.268 కోట్లతో 138 పనులు చేపట్టినట్లు ఈఈ ప్రసాద్ తెలిపారు. 178 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేశామన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో రూ.211.69 కోట్లతో 194 పనులు మంజూరైనట్లు ఈఈ డీఎల్ శ్రీనివాసులు తెలిపారు. ఇందులో 192 కిలోమీటర్ల మేర పూర్తి చేశామన్నారు. ఇదే అంశానికి సంబంధించి ఎస్ఈ మాట్లాడుతూ.. ఏఐఐబీ పనుల పూర్తికి గడువును ప్రభుత్వం మరో ఆర్నెళ్ల పాటు పొడిగించిందన్నారు. డిసెంబర్ నెలాఖరుకల్లా వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

వైభవంతో నృసింహుని జయంత్యుత్సవాలు



మామిళ్లపల్లిలో ప్రత్యేకంగా అలంకరించిన నరసింహస్వామి ఆలయం

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నరసింహస్వామి జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించారు. ముక్తాపురం, మామిళ్లపల్లి, తగరకుంట, తదితర గ్రామాల్లోని నరసింహస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వాతి నక్షత్రం, పౌర్ణమి తిథులలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. ముక్తాపురం నరసింహస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గైనిక్ వార్డులో పేలిన నీరా బాటిల్

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రిలోని గైనిక్ వార్డులో నీరా బాటిల్ పేలిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. ఈ నెల 21న ఓ సిజేరియన్ కేసుకు సంబంధించి బాలింత బంధువులు నీరాను ప్లాస్టిక్ బాటిల్‌లో వార్డుకు తీసుకు వచ్చారు. అయితే, బాటిల్‌కు మూత గట్టిగా బిగించడంతో ఒత్తిడి పెరిగి ఒక్కసారిగా పేలింది. ఉన్నట్లుండి పెద్ద శబ్దం రావడంతో వార్డులోని బాలింతలు, సిబ్బంది ఉలిక్కి పడ్డారు.సెక్యూరిటీ కళ్లు గప్పి బాటిల్‌ను లోపలికి తీసుకువచ్చినట్లు తెలిసింది.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



సర్వజనాస్పత్రిలో ఓపీ బ్లాక్‌ను పరిశీలిస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ మహబూబ్

అనంతపురం మెడికల్: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ మహబూబ్ సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బుధవారం జీజీహెచ్‌లోని ఓపీ, అడ్మిషన్ కౌంటర్, అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్లలో అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా చూస్తామన్నారు. పనులు జరిగే సమయంలో సంబంధిత ఏఈల పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈఈ వెంట డీఈ శ్రీనివాసులు నాయుడు, కాంట్రాక్టర్లు, తదితరులున్నారు.

విత్తన పంపిణీలో ఇబ్బందులు రానీయొద్దు



విత్తన పంపిణీ రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరి

ఆత్మకూరు: ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ విషయంలో రైతులకు ఇబ్బందులు రానీయకుండా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ వ్యవసాయ అధికారులకు సూచించారు. బుధవారం పంపనూరు రైతు భరోసా కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. విత్తన వేరుశనగ కాయల నాణ్యత గురించి ఆరా తీశారు. విత్తన పంపిణీకి ఎంతమంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారో తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుచరిత, సచివాలయ సిబ్బంది శోభ తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్‌కు స్పందన



వెంకటంపల్లిలో విత్తన వేరుశనగను పరిశీలిస్తున్న సిబ్బంది, రైతులు

చెన్నేకొత్తపల్లి : వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉండటంతో రైతులు వేరుశనగ సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తన వేరుశనగ కోసం రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. మండంలోని ఆర్‌బీకేలకు 300 క్వింటాళ్ల కే–6 రకం విత్తన వేరుశనగ కాయలు వచ్చాయని మండల వ్యవసాయాధికారి ఉదయ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఇప్పటి వరకు 269 మంది రైతులు 252 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా అందరికీ విత్తన వేరుశనగ అందజేస్తామని ఏఓ తెలిపారు.



స్కానింగ్ కోసం స్ట్రెచర్‌పైనే గంటల తరబడి వేచి ఉన్న వృద్ధుడు



బ్లడ్ బ్యాంకులో లైటు వెలుతురులో రికార్డులు పరిశీలిస్తున్న స్టాఫ్‌నర్సు



రోగులు, వారి సహాయకుల పడిగాపులు



గర్భిణులకు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్న మహిళా పీజీలు



బ్లడ్ బ్యాంకులో చీకట్లోనే రక్తాన్ని తీసుకెళ్తున్న దృశ్యం, చిత్రంలో టార్చ్‌లైట్ వేసుకున్న సిబ్బంది

కరెంటు లేక రోగుల అవస్థలు

ఈదురుగాలులతో కురిసిన వర్షాలతో నగరంలో పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. సర్వజనాస్పత్రి వెనుక వైపు చెట్లు వడిపోవడంతో కరెంటు సరఫరాకు అంతరాయం కలగింది. దీంతో ఆస్పత్రిలో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిటీ స్కాన్, ఎంఆర్ఐ, బ్లడ్ బ్యాంక్, అల్ట్రాసౌండ్ సెంటర్ తదితర విభాగాల్లో పడిగాపులు కాయాల్సి వస్తోంది. సెల్‌ఫోన్, టార్చ్ వేసుకుని స్టాఫ్‌నర్సులు, సిబ్బంది సేవలందిస్తున్నారు. పరిపాలనా వైఫల్యంతోనే ఇలా జరిగిందని పలువురు తెలిపారు. కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించి మెరుగైన వైద్యం అందేలా చూడాలని రోగులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



కరెంటు లేక అల్ట్రాసౌండ్ బెడ్‌పై వేచి చూస్తున్న రోగి



ఎన్ఆర్‌సీ ముందు చంటిబిడ్డకు టవల్‌తో గాలి విసురుతున్న మహిళ

స్కేటింగ్‌లో హీనా ఫైజా ప్రతిభ



బంగారు పతకం సాధించిన గుత్తి హీనా ఫైజా

అనంతపురం: నేషనల్ ర్యాంకింగ్ ఓపెన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో గుత్తికి చెందిన చిన్నారి హీనా ఫైజా సత్తా చాటింది. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకూ గోవాలో నిర్వహించిన ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొన్న హీనా ఫైజా ఏకంగా స్వర్ణ, రజత పతకాలు సాధించింది. ఐదేళ్ల వయస్సులోనే జాతీయ స్థాయి చాంపియన్ పోటీల్లో రెండు పతకాలు సాధించిన క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పింది. స్కేటింగ్‌లో సత్తా చాటిన హీనా ఫైజాను పలువురు అభినందించారు.

తాడిపత్రిలో నిఘా వైఫల్యంపై చర్యలు

- ఒక హెడ్‌కానిస్టేబుల్ సస్పెండ్ ఆరుగురు ఎస్‌బీ కానిస్టేబుళ్లకు స్థాన చలనం

అనంతపురం: తాడిపత్రి ఘటనకు సంబంధించి నిఘా వైఫల్యంపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. అలజడులని ముందస్తుగా పసిగట్టడంలో విఫలం, ముందస్తుగా అప్రమత్తం చేయకపోవడం, ప్రమాదాన్ని గుర్తించడంలో అలసత్వం వహించిన స్పెషల్ బ్రాంచ్ పోలీసులపై చర్యలు తీసుకున్నారు. ఆరుగురు కానిస్టేబుళ్లను స్పెషల్ బ్రాంచ్ పరిధి నుంచి తప్పించారు. ఒక హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సహాయక చర్యల్లో జాప్యం చేయొద్దు



నగరపాలక సంస్థ సిబ్బందితో మాట్లాడుతున్న మేయర్ వసీం



సహాయక చర్యలను పరిశీలిస్తున్న మేయర్

- మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో ఎటువంటి జాప్యం చేయరాదని మేయర్ వసీం నగరపాలక అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని 5వ రోడ్డు, రంగస్వామి నగర్‌లో జరుగుతున్న సహాయక చర్యలను మేయర్ పరిశీలించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ లక్ష్మీప్రసన్నతో మేయర్ మాట్లాడారు. పడిపోయిన చెట్లను త్వరితగతిన తొలగించేలా చూడాలన్నారు. నగరంలో ఎక్కడైనా సమస్య ఉన్నా.. తక్షణం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం స్థానిక ప్రజలతో మేయర్ మాట్లాడారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాలు వచ్చే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమకాటు వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉంటాయన్నారు. వారంలో ఒక రోజు డ్రైడేగా పాటించాలన్నారు. ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి మేయర్ సూచించారు. మేయర్ వెంట కార్పొరేటర్లు శ్రీనివాసులు, కమల్‌భూషణ్, వైఎస్సార్ సీపీ నాయకులు రామచంద్ర, తదితరులున్నారు.

శభాష్ నాగరాజు

- స్ఫూర్తిని చాటిన జీజీహెచ్ ఎంఎన్ఓ నాగరాజు
- మరణానంతరం దేహదానానికి వీలునామా



వీలునామా పత్రాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావుకు అందజేస్తున్న ఎంఎన్ఓ నాగరాజు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పని చేస్తున్న మేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎంఎన్ఓ) నాగరాజు స్ఫూర్తిని చాటారు. మరణానంతరం తన దేహాన్ని ప్రభుత్వ వైద్య కళాశాల అనాటమీ విభాగానికి అందిస్తానని ముందుకువచ్చి శభాష్ అనిపించుకున్నారు. బుధవారం ఈ మేరకు ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాణిక్యరావుకు వీలునామా పత్రాన్ని అందజేశారు. 40 ఏళ్లకుపైగా సర్వజనాస్పత్రిలో ఎంఎన్ఓగా నాగరాజు రోగులకు సేవలందిస్తున్నారు. 'చనిపోయిన తర్వాత మృత దేహాన్ని బూడిద చేసే కంటే వైద్య విద్యార్థుల విజ్ఞానం కోసం అందిస్తే అంతకంటే సమాజానికి చేసే మేలు ఇంకేముంటుంది' అంటూ ఈ సందర్భంగా నాగరాజు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మాణిక్యరావు మాట్లాడుతూ దేహదానం చాలా గొప్ప విషయమన్నారు. మానవాళికి మంచి చేసేందుకు నాగరాజు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అనాటమీ హెచ్ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వర రావు, పెథాలజీ హెచ్ఓడీ డాక్టర్ శివశంకర నాయక్, సామాజిక వైద్య శాస్త్ర ప్రధాన విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ తెలుగు మధుసూదన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో మహాపుష్పాభిషేకం





జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చిన భక్తజనం (ఇన్‌సెట్‌లో) పుష్పాభిషేకం నిర్వహిస్తున్న దామోదర గౌరంగదాసు తదితరులు

- ఘనంగా సాగిన నృసింహ జయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్: నృసింహ జయంతి వేడుకలు స్థానిక ఇస్కాన్ మందిరంలో బుధవారం కనుల పండువగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చిన భక్తజనంతో ఇస్కాన్ మందిరం కిటకిటలాడింది. 'హరేకృష్ణ... హరే కృష్ణ.. కృష్ణ కృష్ణ హరే హరే' అంటూ ఇస్కాన్ సభ్యులు ఆనంద తాండవం చేశారు. ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు నేతృత్వంలో రాధాపార్థసారథులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలతో పాటూ మహాపుష్పాభిషేకాలు జరిగాయి. అనంతరం నృసింహ ఉద్భవ ఘట్టాన్ని వివరించారు. పలు సంస్థల ప్రతినిధులు, ఇస్కాన్ జీవిత కాల సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యా ప్రమాణాలు

- ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు
- పదో తరగతి పరీక్షల్లో గణనీయంగా పెరిగిన ఉత్తీర్ణత
- ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లకూ భారీగా డిమాండ్

కనగానపల్లి: ప్రభుత్వ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలుస్తున్నాయి. గడిచిన ఐదేళ్ల (2019–2024) జగనన్న ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం కింద పాఠశాలల్లో తరగతి గదులు, డెస్కులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించింది. డిజిటల్ బోధనను తీసుకొచ్చి విద్యార్థులకు మరింత సులభతరంగా బోధన అందిస్తోంది. అంతేకాదు విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్న భోజనం మెనూలో మార్పులు చేసింది. పోషకాలు కలిగిన రుచికరమైన ఆహారం అందిస్తోంది. తగినంత మంది ఉపాధ్యాయులను నియమించి పాఠాలు బోధిస్తోంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువులు సాగుతున్నాయి. విద్యార్థులు సైతం ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటున్నారు. టీచర్లు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని సబ్జెక్టుపై పట్టు పెంచుకుంటున్నారు. పదో తరగతి విద్యార్థుల్లో చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి అత్యుత్తమ మార్కులతో సత్తా చాటుతున్నారు. 600 మార్కులకు 500కు పైబడి మార్కులు సాధించి తాము చదివిన ప్రభుత్వ పాఠశాలలకు గుర్తింపు తీసుకొస్తున్నారు. తమ పిల్లలు ప్రభుత్వ బడిలో చదివి ఉత్తమ మార్కులు సాధించడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు డిమాండ్

రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 263 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మోడల్ స్కూళ్లు 4, కేజీబీవీలు 6, హైస్కూళ్లు 45, ప్రాథమికోన్నత పాఠశాలలు 28, ప్రాథమిక పాఠశాలలు 180 ఉన్నాయి. ఇందులో ఒకటి నుంచి పదో తరగతి వరకు వేలాదిమంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్రతి విద్యాసంవత్సరం ఆరంభంలో కొన్ని పాఠశాలల్లో ప్రవేశాలు దొరకడం గగనమైపోతోంది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లోనూ సీట్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతోంది. ఇది శుభ పరిణామమని పలువురు పేర్కొంటున్నారు.

అత్యుత్తమ మార్కులతో అదుర్స్



తల్లిదండ్రులతో విద్యార్థి దినేష్ కార్తీక్

ఆత్మకూరు మండలం సనప గ్రామానికి జి.దినేష్ కార్తీక్ ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 557 మార్కులు సాధించాడు. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించే చిన్న రాజప్ప, రాజమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కుమారుడు దినేష్ కార్తీక్ స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో చదివాడు. అత్యుత్తమ మార్కులు సాధించి మండలం పేరు నిలబెట్టాడు.

టైలర్ కూతురికి స్టేట్ టాప్ ర్యాంకు



తల్లిదండ్రులతో విద్యార్థి దినేష్ కార్తీక్

చెన్నేకొత్తపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థిని మనోజ్ఞ పదో తరగతి పరీక్షల్లో 591 మార్కులు సాధించి కేజీబీవీల్లో స్టేట్ ఫస్టు ర్యాంకు సాధించింది. ఈ విద్యార్థిని తల్లి అనసూయమ్మ టైలరింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. స్థానిక పాఠశాలలో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని తల్లి పడుతున్న కష్టాన్ని వమ్ము చేయకుండా ఆ విద్యార్థిని పరీక్షల్లో మంచి ప్రతిభ చాటింది. దీంతో మండల విద్యాశాఖ అధికారులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు ఆ విద్యార్థినిని అభినందించి బహుమతులు అందజేశారు.

ప్రతిభ చాటిన కూలీ బిడ్డ



సాయి

ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన రైతు కూలీ తిప్పన్న కుమారుడు సాయి పదో తరగతి పరీక్షల్లో 529 మార్కులు సాధించి ప్రతిభ చాటాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఇతడు ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు దీటుగా మార్కులు సాధించినందుకు పలువురు అభినందనలతో ముంచెత్తారు.

564 మార్కులు సాధించిన రైతు బిడ్డ



సుస్మిత

మండల కేంద్రం కనగానపల్లికి చెందిన రైతు దాసరి ప్రభాకర్ కూతురు సుస్మిత పదో తరగతి పరీక్షల్లో 564 మార్కులు సత్తా చాటింది. గుడిబండలోని ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకుంటున్న ఈ విద్యార్థిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో మంచి మార్కులు సాధించింది.

ప్రశాంతంగా జీవించండి



బసినేపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐలు

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని రామగిరి సీఐ శివాంజనేయులు సూచించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెన్నేకొత్తపల్లి మండలం బసినేపల్లిలో బుధవారం ఉదయం ఎస్ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో పాటు ఏపీఎస్‌పీ సిబ్బందితో కలసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో రౌడీషీటర్లు, గతంలో పోలీసు కేసులు ఉన్న ఇతర అనుమానితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల సమయంలో గొడవలను ప్రేరేపించకుండా ఉండాలని హెచ్చరించారు. గ్రామంలోని వాహనాలకు సంబంధించి రికార్డులు తనిఖీ చేశారు. రికార్డులు లేని ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ, ఎస్ఐలు తెలిపారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ఫలితాలు వెలువడుతాయని, ఆ రోజున గ్రామంలో ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో ఎక్కడైనా చట్ట వ్యతిరేక పనులు, కొత్త వ్యక్తుల సంచరిస్తున్నట్లు అనుమానం కలిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

25న కల్లూరు సుబ్బారావు జయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్: స్వాతంత్య్ర సమరయోధుడు పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జయంతి వేడుకలు ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు ఎల్కేపీ అధ్యక్షుడు గాజుల వెంకటసుబ్బయ్య, కార్యదర్శి పద్మజ తెలిపారు. శనివారం సాయంత్రం లలితకళాపరిషత్తులో జరిగే కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్త తరిమెల అమరనాథరెడ్డికి కల్లూరు వారి పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. అదేరోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి శ్రీకృష్ణరాయభారం పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు.